Presented by
Ghandikota Brahmaji Rao and
Srimathi Sitarama

# నిజం

## చోడిశెట్టి నాగశ్రీనివాసరావు

'ఊపేస్తే కి మీరిక వెళ్లొచ్చు' అన్నట్లుగా ఆ ఆఫీసులో గోడగడియారం ఐదు గంటలు కొట్టింది.

అందుకోసమే ఆత్రంగా ఎదురు చూస్తున్న ఉద్యోగులంతా ఒక్కసారిగా సీట్లలోంచి లేచి అదరాబాదరా ఆఫీసు నుండి బయటపడ్డారు.

అంతా వెళ్ళిపోయాక తను కూడా సీట్లోంచి లేచి బయటికొచ్చిన ప్రకాశరావు మెల్లగా ఇంటివైపు నడక మొదలు పెట్టాడు.

స్పీడుగా పరుగులెడుతున్న వాహనాలతో — హడావిడిగా వస్తూపోతున్న జనంతో రోడ్డు రద్దీగా-సందడిగా వుంది. రోడ్డు పక్కన ఏపుగా పెరిగిన చెట్లమీది నుంచి వుండుండి చల్లనిగాలి వీస్తోంది.

అయితే ప్రకాశరావు ఇవేమీ పట్టించుకునే స్థితిలో లేడు. అతడి మనసంతా ఆందోళనగా వుంది. తప్పనిసరిగా అవుతుందనుకున్న పని-కానప్పుడు కలిగే బాధ అతడి మొహంలో స్పష్టంగా వ్యక్తమవుతుంది. మధ్యాహ్నం పోస్టుమాన్ తెచ్చిచ్చిన ఉత్తరం చదివాక 'ఇప్పుడేం చేయ్యాలి?' అన్న ప్రశ్న అనుక్షణం వేధిస్తూ అతడి కెక్కడా శాంతిలేకుండా చేస్తోంది

అదే ఆలోచనతో ఇంటికొచ్చిన ప్రకాశరావుకు-తాపీగా చుట్ట కాలుస్తూ వీధి అరుగుమీద కూర్చున్న ఇంటి ఓనరు కనిపించాడు.

అతడు ప్రకాశరావుని చూస్తూనే పలకరింపుగా నవ్వి "మీ కిచ్చిన గడువ

మూడురోజులే వుంది...నా అవసరం కూడా పీకలమీదికొచ్చి వుంది. మీరు మళ్ళీ వాయిదా అని మరొకటనీ మాట తప్పకూడదు సుమా!" అన్నాడు హెచ్చరిస్తున్నట్టుగా.

అసలే చిరాకుగా వున్న ప్రకాశరావుకి ఆ మాటలతో చిరాకు మరింత ఎక్కువైంది "ఇంకా మూడురోజులు టైముందన్న విషయం నాకు గుర్తుందిలెండి" అని విసురుగా జవాబు చెప్పి ఇంట్లో ప్రవేశించాడు.

"ఏమలా వున్నారు? ఈరోజు కూడా ఉత్తరం రాలేదా?" అంది భర్త అదోలా వుండటం గమనించిన తాయారు.

"వచ్చింది!" అన్నాడు ముక్తసరిగా ప్రకాశరావు.

"ఏం రాశారు...డబ్బు సర్దుతా నన్నారా!" అంది అనుమానంగా భర్త మొహంలోకి చూస్తూ తాయారు.

"ఇదిగో! నువ్వే చదువు!" అంటూ జేబులోంచి ఉత్తరం తీసి భార్యకిచ్చాడు ప్రకాశరావు. ఆ ఉత్తరం విప్పి చదవ సాగింది తాయారు

"ప్రకాశానికి ఆశీస్సులు-నీ ఉత్తరం చేరింది. నువ్వు అద్దెకుంటున్న భాగం కొనుక్కుంటున్నందుకు చాలా సంతోషం! అయితే నన్ను అయిదువేలు సర్దమని రాశావు. పొలం అమ్మిన డబ్బు ఇంకా నా దగ్గర మిగిలివున్నదని నీ వుద్దేశ్యం కావచ్చు. కానీ, ఆ డబ్బు అప్పులు తీర్చడానికే సరిపోయింది. ఇప్పుడు రెక్కలే తప్ప నా కెలాంటి ఆధారంలేదు. మా పెద్దబ్బాయి రఘురాం రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తూ అనుకున్న దానికంటే ఎక్కువే సంపాదిస్తున్నా - వాడి భార్య షోకులకి. సరదాలకి తగలేస్తుంటాడు తప్ప ఎప్పుడూ పది రూపాయలు సాయం చెయ్యడు నాకు. మిగతా పిల్లలతో ఈ సంసారసాగరా న్నీదుకు రావటం రోజురోజుకూ కష్టమైపోతుంది నువ్వు నమ్మినా నమ్మకపోయినా ఇది మటుకు నిజం!...నీకు డబ్బు సర్దుబాటు చెయ్యలేకపోయినందుకు చింతిస్తున్నాను మరోలా ప్రయత్నించి ఆ ఇంటిభాగం కొనుక్కోగలవు బొల్లో చిన్నదో - పెద్దదో ఇల్లంటూ వుండటం చాలా అవసరం!... నా నిస్సహాయతను మన్నించు...

నీ అన్న జగపతి."

ఉత్తరం పూర్తి కాగానే భర్తవైపు చూసి "మరిప్పుడెలా అంటారు?" అంది చిన్నబోయిన మొహంతో తాయారు.

"అదే అర్థంకావటంలేదు తాయారు! ఏదో విధంగా అన్నయ్య డబ్బు సర్దుతాడని చాలా ఆశపెట్టుకొని వున్నానింత వరకూ..." అన్నాడు దిగులుగా ప్రకాశరావు

"ఎవరికుండే బాధలు, బరువులూ వాళ్ళ కుంటాయండి...అందుకే మరో ప్రయత్నం చెయ్యమని ముందునుంచీ

మొత్తుకుంటున్నాను నేను నా మాట లెక్కే ఐనా లేదు మీకు!" అంది అంతలోనే రుసరుసలాడుతూ తాయారు.

ప్రకాశరావు మాట్లాడలేదు. ఈ సమస్య నుంచి ఎలా గట్టెక్కాలా అన్న ఆలోచనలో పడిపోయాడతను

ఉద్యోగరీత్యా పది సంవత్సరాల క్రితం ఆ ఊరొచ్చిన ప్రకాశరావు అప్పట్నుంచీ ఒకే ఇంట్లో అద్దెకుంటున్నాడు అతనుంటున్న ఇల్లు రెండు భాగాలు. దాన్లో ప్రకాశరావు వుంటున్న భాగం సడెన్‌గా అమ్మకానికి పెట్టాడు ఇంటి ఓనరు...తనకేదో డబ్బు అవసరం పీకలమీదికొచ్చిందనీ - కొనుక్కునేందుకెవరో సిద్ధంగా వున్నందున వెంటనే ఇల్లు ఖాళీచెయ్యమనీ ప్రాధేయపూర్వకంగా ప్రకాశరావుకు చెప్పాడతను

ఆ విషయం వింటూనే ప్రకాశరావు గుండెల్లో రాయిపడింది. అన్ని సౌకర్యాలు వున్న ఆ ఇంట్లోంచి వెళ్ళిపోవడమంటే అతడికెంతో బాధకలిగింది. మరో ఇంట్లోకి-మరో ఇంట్లోకి మార్తూ అద్దెలు పొయ్యడం కంటె ఆ భాగం తనే తీసుకుంటే బాగుంటుందనుకున్నాడు. భార్యతో కూడా ఆలోచించి తన అభిప్రాయం ఇంటి ఓనరుకు చెప్పాడు.

"మీరు తీసుకుంటే మరీ మంచిది. ఇప్పుడున్న రేటు ప్రకారం ఈ భాగం ఇరవై అయిదువేలు ఖరీదు కట్టారు. మీకైతే ఓ వెయ్యి తగ్గిస్తాను. కాని రాతకోతలన్నీ వెంటనే పూర్తయిపోవాలి!" అన్నాడు ఇంటి ఓనరు.

లేడికి లేచిందే పరుగన్నట్టుగా చెయ్యడానికి ప్రకాశరావు దగ్గరంత డబ్బు రెడీగా లేదు...అలాగని వచ్చిన అవకాశం వదులుకోవడం కూడా అతడికి ఇష్టం లేకపోయింది...అదృష్టవశాత్తు ఆ నెలలోనే పి.ఎఫ్. లోను పెట్టాడు. అది రెండు రోజుల్లో ఆరువేలవరకూ వస్తుంది. బ్యాంకులో దాచిన డబ్బు పదివేలుంది. భార్య నగలు తాకట్టు పెడితే సుమారుగా అయిదువేలవరకూ రావచ్చు. ఇక మిగతా అయిదువేలు తన అన్న జగపతి సర్దుతాడన్న నమ్మకంతో ఇంటి ఓనర్ని పదిరోజులు టైమడిగాడు.

అన్నగారిమీద అతడంత నమ్మకం పెట్టుకోడానికి కారణం - అప్పటికయిదు వారాల క్రితమే జగపతి తను సంపాదించుకున్న స్వంత పొలం యాభై వేలకు అమ్మేశాడు. అందుకు సంబంధించిన రాతకోతలన్నీ ప్రకాశరావు సమక్షంలోనే జరిగాయి...అన్నగారు ఆ డబ్బు సర్దుతాడన్న నమ్మకంతోనే ధైర్యంగా రంగంలోకి దిగేడు ప్రకాశరావు.

ముందు కాదు-కూడదన్నా చివరకు గడువివ్వడానికి ఒప్పుకున్నాడు ఇంటి ఓనరు. దాంతో రెండువేలు అడ్వాన్సుగా ఇచ్చి ఆ భాగం తనపేర రాయించుకున్నాడు. ఆ వెంటనే పరిస్థితి వివరిస్తూ అయిదువేలు సర్దుబాటు చెయ్యమనీ-మళ్ళీ

మూడు, నాలుగునెలల్లో ఆ పేమెంటు తిరిగిచ్చేస్తానని అన్నగారికి ఉత్తరం రాశాడు.

అనుకున్న విధంగా అన్నీ సమకూరి వస్తేగాని అన్నగారి దగ్గర్నుంచి వచ్చిన ఉత్తరం మాత్రం అతడి మతి పోగొట్టింది. తక్కువొచ్చిన అయిదువేలు ఏ విధంగా సమకూర్చాలన్నది అతనికి ఇప్పుడు పెద్ద సమస్యగా తయారై కూర్చుంది. అన్నగారే తప్ప ఇక తన తరఫునుంచి అండే సహాయమేమీ లేదు. పోనీ మామగార్ని అడుగుదామంటే ఆడ పిల్లల పెళ్ళిళ్ళు చేసి చితికిపోయి—రేపో మాపో చితికెళ్ళటానికి సిద్ధంగా వున్నాడాయన... ఒక్కొక్క రోజూ గడిచేకొలదీ గడువు జ్ఞాపకం చేస్తూ - గడువు దాటితే మాత్రం ఇచ్చిన అడ్వాన్సు చెడిపోవాలిసివుంటుందనీ, ఇల్లు మరొకళ్ళకి అమ్మేస్తాననీ హెచ్చరిస్తున్నాడు ఇంటి ఓనరు. అతడన్నట్టు మరో మూడురోజుల్లో గడువు పూర్తవుతుంది...

చేతిలో పూర్తిగా డబ్బు లేకుండా ఇల్లు కొనడానికి సిద్ధపడినందుకు మొదటిసారిగా తనని తాను తిట్టుకున్నాడు ప్రకాశరావు. గాలిలో దీపం పెట్టి 'దేవుడా నువ్వే దిక్కన్నట్టుగా' ఈ వ్యవహారంలోకి దిగేడు తను. అన్నగారు డబ్బు సర్దుతానని అనుకున్నాడేగాని ఆయన కుండే సాధకబాధకాల గురించి ఎంతమాత్రం ఆలోచించలేదు... ఆయన ఉత్తరంలో రాసినదంతా నిజమే అయివుండవచ్చు. తనకి తెలియని అప్పులెన్నో వుండి వుండొచ్చు. రఘురాం తర్వాత వున్న ముగ్గుర్నీ, ఎప్పుడూ ఏదొక రోగంతో బాధపడే భార్యనీ రెక్కల కష్టంతోనే పోషించుకురావాలి... తాయారన్నట్టు ఎవరి బాధలు వాళ్ళవి. ఇంతకీ తను యిప్పుడేం చెయ్యాలి? గడువుప్రకారం వ్యవహారం పూర్తిచేసుకోకపోతే రెండు వేలు కూడా పోతుందే!.... ప్రకాశరావు దీర్ఘంగా ఆలోచిస్తూ తల బద్దలు కొట్టుకుంటున్నాడు.

"ఏమిటలా ఆలోచిస్తూ వుండిపోయారు? మీ ఆఫీసులో అయిదువేలు అప్పు ఇచ్చేవాళ్ళెవరూ లేరా?" కాస్సేపటి తర్వాత అడిగింది తాయారు.

"ఉన్నారు తాయారు. కాని, నూటికి అయిదురూపాయలు వడ్డీ తీసుకుంటారు. అందుకే ఇంతవరకెవర్నీ అడగలేదు!" అన్నాడు ఆలోచనల్లోంచి తేరుకొని ప్రకాశరావు.

"అయిదురూపాయలైతే... అమ్మో, చాలా వడ్డీ కట్టాల్సివస్తుందే!" అంది భయపడిపోతూ తాయారు

"వేలమీద గనక అయిదురూపాయల వడ్డీ. అదే వందలమీదైతే నూటికి పది రూపాయలకు తక్కువ తీసుకోరు!" అన్నాడు చిన్నగా నవ్వి ప్రకాశరావు

భార్యాభర్తలిద్దరికీ ఏం తోచకుండా వుంది... మెల్లగా సమయం గడుస్తోంది—



ఇంతలో వచ్చారు. జగవతి కొడుకు రఘురాం అతన్ని చూడగానే ప్రకాశ రావు మనసులో ఏదో ఆశ చిగురించింది.

"ఇదేమిటి ఇద్దరూ అలా కూర్చుండి పోయారు- ఏమైంది?" అన్నాడు రఘురాం లోపలికొస్తూనే ఆశ్చర్యంతో.

"వూరికినే బాబూ! మంచి నీళ్ళివ్వమంటావా?..." అంటూనే లోపలికెళ్ళి- మంచినీళ్ళు తీసుకొచ్చి ఇచ్చింది తాయారు

"నాన్న పంపించా డేమి ట్రా రఘురాం!?" అన్నాడు. ఆతృతనణుచుకో లేని ప్రకాశరావు.

రఘురాం మంచినీళ్ళు తాగుతున్న వాడల్లా ఆగి, "నాన్న పంపించడ మేమిటి చిన్నాన్నా! నేను ఇల్లు వదిలిపెట్టి ఇర వై రోజులైంది. మా కంపెనీ తరపున ఆర్డర్సు బుక్ చెయ్యడానికి అన్ని వూళ్ళూ తిరుగుతూ ఈ రోజు మధ్యాహ్నమే

ఇక్కడికొచ్చావు. ఏమిటి మీరంత దీర్ఘాలోచనలో వున్నారు?" అన్నాడు మళ్ళీ రఘురాం

అన్నగారు డబ్బు ఎవరి దగ్గరైనా అప్పుచేసి సంపాదేమో అనుకుంటున్న ప్రకాశరావు ఆ మాటలతో పీరుకారి పోయాడు... "నాకో అయిదువేలు అర్జంటుగా కావాలిరా! నీ దగ్గరుంటే ఇవ్వకూడదూ!!" అన్నాడు కొన్ని క్షణాలాగి.

"నా దగ్గర అయిదువేలా!..." నవ్వేడు రఘురాం

"నిజమే బాబూ! వూరికినే కాదులే వడ్డీ ఇస్తాం!!" అంది చిన్నగా మందహాసంచేస్తూ కాయూరు.

"అసలు డబ్బంటూ వుంటే మీ దగ్గర వడ్డీ తీసుకుంటావేమిటి పిన్నమ్మా?... అయినా ఇప్పుడెందుకంత డబ్బు?" అన్నాడు రఘురాం.

తనకెందుకంత డబ్బు కావాలసి వచ్చిందో వివరంగా రఘురాంకి చెప్పాడు ప్రకాశరావు.

"ఈ మాత్రానికే ఇంత హైరాన పడ్డందేనికి చిన్నాన్నా!?... నాన్న దగ్గర కెళ్ళి అడగండి మొన్న పొలం అమ్మిన డబ్బులో అప్పులు తీర్చగా మిగిలిన ఇరవై వేలూ బ్యాంక్‌లో వేశారు మళ్ళీ ఏదో కిందా-మీదాపెట్టి సరిపెట్టొద్దురు గాని." అన్నాడు చాలా తేలికగా రఘురాం.

అతడి మాటలు వింటూనే వులిక్కిపడి మొహాలు మొహాలు చూసుకున్నారు కాయూరు, ప్రకాశరావులు... వాళ్ళిద్దరి మనస్సులూ ఒక్కసారిగా కలుక్కుమన్నాయి.

వాళ్ళ బాధను ఏ మాత్రం గమనించని రఘురాం. "నేనొక ఫార్టీని కలుసుకొని భోజనానికి ఇక్కడికే వచ్చేస్తాను పిన్నమ్మా! మీరు ఎనిమిదిగంటల బస్సులో బయల్దేరి వెళ్ళండి చిన్నాన్నా!!" అని నిష్కల్మషంగా చెప్పి వెళ్ళిపోయాడు.

"చూశారా ఎంత చిత్రమో... మీరు తమ్ముడన్న ఇది కూడా లేకుండా పరాయివాడికి రాసినట్టు- డబ్బుంచుకునే లేదని ఉత్తరం వ్రాశారు... ఇక ఇవ్వమనుకున్నారు కాబోలు" అంది, నిష్ఠురత, బాధ కలగలిసిన కంఠంతో కాయూరు.

"ఎందుకు బాధపడతావు కాయూరు?— రఘురాం రాకతో అసలు విషయం తెలియడంతో బాటు- డబ్బు ముందు— రక్తసంబంధానికూడా విలువ లేదన్న నిజం నాకీరోజు స్పష్టంగా బోధపడింది- తెలియక ఏదో అనుకుంటాంగాని కొన్ని నిజాలను బయటపెట్టడానికే జీవితంలో ఇలాంటి సంఘటనలు తటస్థిస్తాయేమో ననిపిస్తుంది- వస్తామండు!" అని పైకి లేచాడు ప్రకాశరావు.

"ఎక్కడికి?" అంది కాయూరు.

"అయిదురూపాయల వడ్డీకి నా కొలీగ్ దగ్గర డబ్బు మాట్లాడి వస్తాను. ఇంటి దస్తావేజులు మన చేతికి రాగానే అవెక్కడో తక్కువ వడ్డీకి తనఖాపెట్టి ఆ అప్పు తీర్చేద్దాం!!" అంటూ బరువెక్కిన హృదయంతో బయటకు నడిచాడు ప్రకాశరావు. •